
ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
MHR TV
మెదక్ | సంపుటి: 19 సంచిక : 159 | బుధవారం 11, ఫిబ్రవరి 2026 | పేజీలు: 06 వెల: రూ.1
Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com

# లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాసం

**ఓం బిర్లాకు కాంగ్రెస్ నోటీసులు**
**118 ఎంపీల సంతకాలతో నిర్ణయం**
**రాహుల్ ప్రసంగాన్ని అడ్డుకోవడంపై విమర్శలు**
**స్పీకర్ తీరుపై ప్రతిపక్షాల ఆరోపణలు**
**ఓం బిర్లా చర్యలను సమర్థించిన ప్రభుత్వం**
**రాజకీయంగా వేడెక్కిన పార్లమెంట్**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ముందడుగు వేసింది. మంగళవారం లోక్‌సభ సెక్రటరీ జనరల్‌ను కలిసి కాంగ్రెస్ డిప్యూటీ లీడర్ గౌరవ్ గగోయ్ అవిశ్వాస తీర్మాన నోటీసును అందజేశారు. ఈ తీర్మానానికి మద్దతుగా వంద మందికి పైగా ఎంపీల సంతకాలు సేకరించినట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. స్పీకర్ పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని, పార్లమెంట్‌ను ప్రజాస్వామ్య వేదికగా కాకుండా ప్రభుత్వానికి అనుకూలంగా మార్చారని ..మిగతా 5లో



# నా పేరును మార్చడానికి మీరెవరు?

**సీఎం రేవంత్ వ్యాఖ్యలకు కిషన్ రెడ్డి కౌంటర్**
**మా తల్లి పెట్టిన పేరును మార్చి పిలువడమేమిటని ఆగ్రహం**
**అవసరమైతే రేవంత్ ఖాన్‌గా మార్చుకోవాలని ఎద్దేవా**
**అన్ని స్థానాల్లో మజ్లిస్ పార్టీ**
**ఎందుకు పోటీ చేయడం లేదని నిలదీత**
**పార్లమెంట్ వేదికగా తీవ్ర ఆగ్రహం**
**రాజకీయ స్థాయి దిగజారుతోందని వ్యాఖ్యలు**
**ప్రజాస్వామ్యానికే మచ్చ తెస్తున్నారని విమర్శలు**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణ రాజకీయాల్లో మాటల యుద్ధం మరింత తీవ్ర స్థాయికి చేరింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర నేత కిషన్ రెడ్డి లోక్‌సభ వేదికగా ఘాటుగా స్పందించారు. వ్యక్తిగత విమర్శలతో రాజకీయాలు దిగజారుతున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఉద్దేశిస్తూ, ఆయన ..మిగతా 2లో

# నేడే మున్సిపల్ పోలింగ్




## ఎన్నికలకు సర్వం సిద్ధం

**మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఏర్పాట్లు..**
**7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో పోలింగ్**
**ఓటు హక్కు వినియోగించుకోనున్న 52 లక్షల ఓటర్లు**
**బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య తీవ్ర పోటీ**
**పోటాపోటీగా ప్రచారంలో పాల్గొన్న ముఖ్య నేతలు**
**ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణ వ్యాప్తంగా నేడు మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రంలోని పట్టణ పాలనకు సంబంధించిన కీలకమైన ఈ ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. భద్రతా చర్యలు, పోలింగ్ కేంద్రాల సిద్ధం, ఎన్నికల సిబ్బంది నియామకం వంటి పనులను అధికారులు చివరి దశకు తీసుకువచ్చారు. నేడు ఉదయం పోలింగ్ ప్రారంభం కానుంది.ఈసారి తెలంగాణలో మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. వీటిలో 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలు ఉన్నాయి. ఈ అన్ని సంస్థల్లో వార్డు సభ్యుల ఎన్నికల కోసం ఓటింగ్ జరగనుంది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలోని పట్టణ ప్రాంతాల్లో ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకోనున్నారు.మొత్తంగా ఈ ఎన్నికల్లో 2,996 వార్డులకు ..మిగతా 5లో

# వ్యక్తిగత విమర్శలకే పరిమితం

**రాజకీయ నాయకులపై కవిత వ్యాఖ్యలు**
**మున్సిపల్ ఎన్నికల్లో హంగ్ తప్పదని జోస్యం**
**నేతలు సమస్యలే మరిచిపోయారని విమర్శలు**
**సీఎం రాష్ట్రాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారన్న కవిత**
**మౌలిక వసతులు పట్టించుకోవట్లేదని ఆగ్రహం**
**బస్తీ దవాఖానాలు, డ్రైనేజీ సమస్యల ప్రస్తావన**
**రిటైర్ట్ ఉద్యోగుల దుస్థితిపై ఆవేదన**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణలో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో మెజారిటీ మున్సిపాలిటీల్లో హంగ్ పరిస్థితి తప్పదని తెలంగాణ జాగృతి చీఫ్, మాజీ ఎమ్మెల్సీ కవిత అభిప్రాయపడ్డారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి ..మిగతా 2లో



# నా ఫోన్ ట్యాప్ చేస్తున్నారు..

**నేను కాన్ఫరెన్స్ కాల్‌లో ఏం మాట్లాడానో**
**ఆ పార్టీ నేతలకు ఎలా తెలుస్తుంది..?**
**ఉద్యోగులతో మాట్లాడిన మాటలు ఎవరు**
**విన్నారో విచారణ చేయిస్తానని వెల్లడి**
**ఫోన్ ట్యాపింగ్ పరికరాలు ఎక్కడెక్కడ..?**
**బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం**
**మంత్రి పొంగులేటి సంచలన వ్యాఖ్యలు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ ఇప్పటికీ జరుగుతోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. ఫోన్ పరికరాలు ఇంకా బీఆర్ఎస్ నేతల వద్ద ఉన్నట్లు అనిపిస్తోందని ..మిగతా 2లో



# మున్సిపల్ ఎన్నికల వేళ దారుణం

**మక్తల్‌లో బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య**
**కాంగ్రెస్‌పై బండి సంజయ్ తీవ్ర ఆరోపణలు**
**పార్లమెంట్‌లో ప్రస్తావించిన కిషన్ రెడ్డి**
**బెదిరింపులే కారణమన్న రామచంద్రారావు**
**మక్తల్‌లో రాజకీయ ఉద్రిక్తతలు**
**ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో చోటుచేసుకున్న ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. భారతీయ జనతా పార్టీ తరపున కౌన్సిలర్‌గా పోటీ చేస్తున్న అభ్యర్థి ఆత్మహత్య చేసుకోవడం రాజకీయ వర్గాల్లో ..మిగతా 2లో




# ధైర్యంగా ఉండండి.. పార్టీ మీకు అండగా ఉంది

**గిరిజన బిడ్డ ఎరుకల**
**మహదేవప్ప ఆత్మహత్య**
**ఆత్మహత్యపై స్పందించిన**
**కేంద్ర మంత్రి బండి సంజయ్**
**కార్యకర్తలకు**
**బీజేపీ అండగా ఉంది**




# గోషామహల్‌లో భారీగా డబ్బు పట్టివేత!

భారీ మొత్తంలో నగదు పట్టుకున్న పోలీసులు
ద్విచక్ర వాహనాలపై సంచులతో ప్రయాణిస్తున్న ముగ్గురు అరెస్ట్
రూ.67 లక్షల నగదు స్వాధీనం చేసుకున్న గోషామహల్ పోలీసులు
నిందితులు కొంతకాలంగా నగదు అక్రమ రవాణాకు
పాల్పడుతున్నట్లు గుర్తించిన పోలీసులు
నగదు, నిందితులను ఆదాయపన్ను శాఖకు అప్పగించిన పోలీసులు




# కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం

**ప్రభుత్వ నిర్లక్ష్యంపై హరీశ్ రావు విమర్శలు**
**ఏపీ సర్కార్ పై తీవ్ర ఆరోపణలు**
**80 శాతం నీళ్లు వాడుకున్నారన్న హరీశ్**
**సీఎం మౌనంగా ఉన్నారని ఆగ్రహం**
**ఉద్దేశ్యపూర్వకంగానే అన్యాయం చేస్తున్నారని**
**కేంద్రమంత్రులు బండి, కిషన్ రెడ్డి పైనా ఫైర్**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం ..మిగతా 5లో



# మున్సిపల్ ఎన్నికల వేళ దారుణం

**మొదటిపేజీ తరువాయి**

తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ ఘటనతో మక్తల్‌లో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మక్తల్ మున్సిపాలిటీ ఆరో వార్డు పరిధిలోని చందాపూర్ గ్రామానికి చెందిన మహదేవప్ప (48) బీజేపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉన్నారు. మంగళవారం తెల్లవారుజామున తన నివాసంలో ఉరివేసుకుని ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**వేధింపుల ఆరోపణలు**

మహదేవప్ప భార్య సత్తెమ్మ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచార సమయంలో సోషల్ మీడియాలో ప్రత్యర్థుల నుంచి తన భర్తకు తీవ్ర వేధింపులు ఎదురయ్యాయని ఆరోపించారు. అనుచిత వ్యాఖ్యలు, బెదిరింపులు కారణంగా ఆయన తీవ్ర మానసిక ఒత్తిడికి లోనయ్యారని తెలిపారు. ఇదే ఆత్మహత్యకు దారితీసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆరోపణలపై కూడా విచారణ చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

**రాజకీయంగా చర్చనీయాంశంగా మారిన ఘటన**

ఈ ఘటన మున్సిపల్ ఎన్నికల వేళ జరగడం వల్ల రాజకీయంగా తీవ్ర దుమారం చెలరేగింది. బీజేపీ నేతలు ఇది సాధారణ ఆత్మహత్య కాదని, రాజకీయ వేధింపుల వల్ల జరిగిన బలవన్మరణమని ఆరోపిస్తున్నారు. గిరిజన వర్గానికి చెందిన మహదేవప్పను అణిచివేయాలనే ఉద్దేశంతోనే ప్రత్యర్థులు బెదిరింపులకు పాల్పడ్డారని బీజేపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు.

**రామచంద్రరావు దిగ్భ్రాంతి**

ఈ ఘటనపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మహదేవప్ప ఆత్మహత్య తనను తీవ్రంగా కలచివేసిందని, ఇది అత్యంత బాధాకరమైన ఘటన అని అన్నారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మహదేవప్ప ఆత్మహత్య వెనుక అహంకారపూరిత రాజకీయాలు, మాఫియా బెదిరింపులే కారణమని ఆరోపించారు. స్థానికంగా అధికార పార్టీ నేతల నుంచి తీవ్ర ఒత్తిడి, వేధింపులు ఎదురయ్యాయని ప్రాథమిక సమాచారం ద్వారా తెలుస్తోందని చెప్పారు. ఈ ఘటనకు కారణమైన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిష్పాక్షిక విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.

**బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ కుమార్ ఈ ఘటనపై తీవ్ర స్థాయిలో స్పందించారు. "ఇది ఆత్మహత్య కాదు.. కాంగ్రెస్ చేసిన హత్య" అంటూ మండిపడ్డారు. ఓటమి భయంతోనే అధికార పార్టీ నేతలు బెదిరింపులు, అరాచకాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బీజేపీ కార్యకర్తల సహనాన్ని పిరికితనంగా భావించవద్దని హెచ్చరించారు. ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. బీజేపీ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, పార్టీ నాయకత్వం పూర్తిగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మహదేవప్ప ఆత్మహత్యకు కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయాలని, నిష్పక్షపాతంగా విచారణ జరిపి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

**అండగా ఉంటామని హామీ**

మహదేవప్ప కుటుంబాన్ని పరామర్శించేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు మక్తల్‌కు బయలుదేరారు. కుటుంబానికి పార్టీ తరపున అన్ని విధాలా అండగా ఉంటామని నాయకులు హామీ ఇచ్చారు. ఈ ఘటనపై న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని బీజేపీ స్పష్టం చేసింది.

**కాంగ్రెస్‌పై ఆరోపణలు**

బీజేపీ నేతలు అధికార కాంగ్రెస్ పార్టీపై తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. అధికార మత్తులో ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారని విమర్శించారు. స్థానిక మంత్రి శ్రీహరి, ఆయన అనుచరుల వేధింపులు తట్టుకోలేకే మహదేవప్ప బలవన్మరణానికి పాల్పడ్డారని ఆరోపణలు చేస్తున్నారు. మంత్రి శ్రీహరిని తక్షణమే అరెస్ట్ చేయాలని, మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం నిష్పాక్షికంగా విచారణ జరపకపోతే, బీజేపీ కార్యకర్తల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. దోషులు ఎంతటి వారైనా వదిలిపెట్టకూడదని స్పష్టం చేశారు.

**పార్లమెంట్‌లో ప్రతిధ్వని**

మక్తల్ ఘటన పార్లమెంట్ వరకు చేరింది. లోక్‌సభలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ముఖ్యమంత్రి సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో అధికార పార్టీ నేతలు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని అన్నారు. ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులను బెదిరించడం, కిడ్నాప్ చేయడం వంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ వేధింపులను తట్టుకోలేకే బీజేపీ అభ్యర్థి మహదేవప్ప తీవ్ర ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎన్నికల పోలింగ్ దగ్గర పడుతున్న వేళ కాంగ్రెస్ ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ పరిణామాలను లోక్‌సభ ఖండించాలని కోరారు.

**దర్యాప్తుపై ఉత్కంఠ**

ఇక ఈ ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు, సోషల్ మీడియా పోస్టులు, ఎన్నికల ప్రచారంలో జరిగిన పరిణామాలపై వివరాలు సేకరిస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లు, బెదిరింపుల అంశాలపై కూడా విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల వేళ చోటుచేసుకున్న ఈ ఘటన రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఉద్రిక్తతను సృష్టించింది. ఒక అభ్యర్థి ప్రాణాలు కోల్పోవడం ప్రజాస్వామ్యానికి మచ్చగా మారిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. విచారణలో నిజాలు పూర్తిగా బయటపడి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటేనే ప్రజల్లో నమ్మకం నిలుస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.





# నా పేరును మార్చడానికి మీరెవరు?

**మొదటిపేజీ తరువాయి**

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి దత్తపుత్రుడని వ్యాఖ్యానించడం రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. అంతేకాదు, కేసీఆర్‌ను జైలులో పెట్టేవరకు కిషన్ రెడ్డి అని కాకుండా కల్వకుంట్ల కిషన్ రావు అని పిలుస్తానని సీఎం చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. ఈ వ్యాఖ్యలకు తాజాగా కిషన్ రెడ్డి ప్రత్యక్షంగా స్పందించారు. మంగళవారం లోక్‌సభలో మాట్లాడిన కిషన్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనపై అనవసరమైన వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా, పేరు, ఇంటి పేర్లపై వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. ప్రజాస్వామ్యంలో పాలకులు విమర్శలను స్వీకరించి సమాధానం ఇవ్వాలి తప్ప, వ్యక్తిగత దూషణలకు దిగకూడదని ఆయన స్పష్టం చేశారు. తన పేరు, ఇంటిపేరు మార్చి పిలవడం సరైన పద్ధతి కాదని కిషన్ రెడ్డి అన్నారు. తల్లిదండ్రులు పెట్టిన పేరును మార్చే హక్కు ఎవరికీ లేదని వ్యాఖ్యానించారు. సరదాగా ఉంటే మీరు కూడా మీ పేరు మార్చుకోవచ్చని, అందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఎద్దేవా చేశారు. అయితే ఇలా మాట్లాడటం ముఖ్యమంత్రి స్థాయికి తగినది కాదని ఆయన విమర్శించారు.



తాను ఎవరికీ దత్తపుత్రుడిని కాదని, తన రాజకీయ ప్రయాణం ప్రజల ఆశీర్వాదంతోనే కొనసాగుతోందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్‌తో మీకు ఏవైనా రాజకీయ విభేదాలు ఉంటే, మీరు మీరే తేల్చుకోవాలని, ఆ వివాదాల్లో తనను లాగవద్దని సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు. వ్యక్తిగత విమర్శలు రాజకీయ బలహీనతకు నిదర్శనమని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో ఎంఐఎంతో కలిసి ఉన్న రోజులను కూడా కిషన్ రెడ్డి ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఆ కాలంలో చేసిన రాజకీయ వైఖరిని ప్రజలు మరిచిపోలేదని, ఇప్పటికీ అదే ధోరణి కొనసాగుతోందని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు విషయంలో ప్రశ్నలు ఎదురైతే సమాధానాలు చెప్పకుండా, ఇతరులపై నిందలు వేయడం సరికాదని అన్నారు.

ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మరో కీలక అంశాన్ని కూడా లోక్‌సభలో లేవనెత్తారు. నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో జరిగిన ఓ దారుణ ఘటనను సభ దృష్టికి తీసుకువచ్చారు. బీజేపీ తరఫున 6వ వార్డులో పోటీ చేస్తున్న ఎస్టీ అభ్యర్థి ఎరుకల మహదేవప్ప ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని చెప్పారు. ఈ ఘటన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లా మహబూబ్‌నగర్ పరిధిలో జరగడం మరింత బాధాకరమని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. గెలుపు ఖాయం అయినప్పటికీ, గెలిచిన తర్వాత కూడా అధికార పార్టీ వేధింపులు ఉంటాయనే భయంతో ఆ అభ్యర్థి తీవ్ర ఒత్తిడికి గురయ్యాడని తెలిపారు. ఆ భయాన్ని తన భార్యకు కూడా స్పష్టంగా చెప్పిన తర్వాతే ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డారని చెప్పారు.

ఇది సాధారణ ఘటన కాదని, ప్రజాస్వామ్య వ్యవస్థకు మచ్చ తెచ్చే విషయం అని కిషన్ రెడ్డి అన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు భయభ్రాంతులకు గురవుతున్న పరిస్థితి రాష్ట్రంలో ఉందని విమర్శించారు. అధికార పార్టీ నేతల వేధింపుల వల్లే ఈ ఘటన చోటు చేసుకున్నదా అనే కోణంలో లోతైన విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి, వారి మీద కఠిన చర్యలు తీసుకోవాలని కిషన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఒక ప్రజాప్రతినిధి అభ్యర్థి తన ప్రాణాలు తీసుకునే స్థితికి వెళ్లడం తెలంగాణలో ప్రజాస్వామ్యం ఏ స్థాయికి చేరిందో చూపిస్తోందని అన్నారు.

మొత్తంగా చూస్తే, తెలంగాణ రాజకీయాల్లో మాటల తూటాలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, వాటికి కిషన్ రెడ్డి ఇచ్చిన ప్రతిస్పందన రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. ప్రజాసమస్యలు, హామీల అమలు, అభివృద్ధి అంశాలపై చర్చ జరగాల్సిన సమయంలో వ్యక్తిగత విమర్శలు పెరగడం ప్రజల్లో అసంతృప్తిని కలిగిస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒకవైపు ముఖ్యమంత్రి స్థాయి నేతలు తీవ్ర వ్యాఖ్యలు చేస్తుండగా, మరోవైపు కేంద్ర మంత్రులు అదే స్థాయిలో కౌంటర్ ఇవ్వడం రాజకీయ ఉద్రిక్తతను పెంచుతోందని భావిస్తున్నారు. ఈ పరిస్థితి ఎటు దారితీస్తుందన్నది రానున్న రోజుల్లో తేలనుంది.

ఇదిలా ఉండగా, ఎన్నికల వేళ చోటుచేసుకున్న ఎరుకల మహదేవప్ప ఆత్మహత్య ఘటన రాష్ట్ర రాజకీయాలను మరింత కలవరపెడుతోంది. దీనిపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో, విచారణ ఎటువైపు సాగుతుందో అన్నది రాజకీయంగా కీలకంగా మారింది. వ్యక్తిగత విమర్శలకే పరిమితం కాకుండా, ఇటువంటి ఘటనలపై ప్రభుత్వ బాధ్యత ఏమిటన్న ప్రశ్నలు కూడా ప్రజల్లో వినిపిస్తున్నాయి. తెలంగాణలో రాజకీయ వేడి తగ్గే పరిస్థితి కన్పించడం లేదని, మాటల యుద్ధం మరింత ఉద్ధృతమవుతున్న నేపథ్యంలో ప్రజలు మాత్రం పాలన, అభివృద్ధి, భద్రత వంటి అంశాలపై స్పష్టమైన సమాధానాలు కోరుకుంటున్నారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.



# నా ఫోన్ ట్యాప్ చేస్తున్నారు..

**మొదటిపేజీ తరువాయి**

ఆరోపించారు. లేకుంటే తాను కాన్ఫరెన్స్ కాల్‌లో ఏం మాట్లాడానో ఆ పార్టీ నేతలు ఎలా చెప్పగలుగుతున్నారని ప్రశ్నించారు. ఇప్పటికీ బీఆర్ఎస్ నేతలు ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారని ఈ విషయాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందన్నారు. ఇంకా ఎన్ని పరికరాలు ఏయే మామిడితోటలు, ఫామ్ హౌస్‌లు, ఇళ్లలో ఉన్నాయో? ఫోన్ కాల్స్ ఇంకా ఎంత మంది వింటున్నారో ఎంక్వైరీ చేసి అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. మంగళవారం ఖమ్మంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పచ్చకామెర్లు వచ్చిన వారికి లోకమంతా పచ్చగా కనిపించినట్టు అధికారంలో ఉండగా బెదిరింపులకు పాల్పడిన వారికి... తాము ఓట్లు అడుగుతుంటే బెదిరింపులకు పాల్పడినట్లు భావన కలుగుతోందని విమర్శించారు. సామాన్య ప్రజలకు హక్కు ఉన్నట్లుగానే ఉద్యోగులకు కూడా తమ ఓటును వినియోగించుకునే హక్కు ఉందన్నారు. అధికారులను ఓటు అడగడంలో తప్పేముందని నిలదీశారు. సీఎం రేస్‌లో తాను లేనని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని తాను అనేక సందర్భాల్లో చెప్పానని చెప్పారు. తాను పార్టీలో ఒక సామాన్య కార్యకర్తను మాత్రమేనని వివరణ ఇచ్చారు. తాను సీఎం రేస్ లో ఉన్నట్లు కొందరు వ్యాఖ్యలు చేస్తున్నారనీ... ఈ విషయంలో ఎవరి అభిమానం వారిదని అన్నారు. రాష్ట్రంలో కొత్త జిల్లాల పెంపు, తగ్గింపు లేదని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా చెప్పారన్న పొంగులేటి.. గత ప్రభుత్వంలో అశాస్త్రీయంగా జరిగిన జిల్లాల ఏర్పాటుపై ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులపై కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఆ కమిటీ ఇచ్చే నివేదికను అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కనీసం ఈ చర్చకైనా కేసీఆర్ అసెంబ్లీకి రావాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టబోతున్నారని గ్రహించిన కేటీఆర్.. అదే భంగపాటుతో సీఎం రేవంత్ రెడ్డి, మిగతా ముఖ్య నేతలపై నోరుపారేసుకుంటున్నారని మంత్రి మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ఎన్నికల సమయంలోనూ చాలెంజ్ లు చేసి, రెఫరెండమని మాట్లాడి భంగపడ్డారన్నారు. మున్సిపాలిటీల్లోనూ కాంగ్రెస్ గెలవబోతోందనే బీఆర్ఎస్ నేతలు సైలెంట్ అయ్యారన్నారు. నేడు జరగనున్న ఎన్నికల్లో 80 శాతానికి పైగా మున్సిపాలిటీలపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. తమ ప్రభుత్వం రెండేళ్లుగా పేదవాడికి అండదండగా నిలిచేలా సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించి చేస్తోందని మంత్రి వివరించారు. దేశంలో ఎక్కడా లేని అద్భుతమైన పాలసీలు తీసుకువచ్చి విద్యా, వైద్యానికి ఈ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇప్పటి వరకు నిరుద్యోగులకు 71 వేల ఉద్యోగులకు ఇచ్చామన్న ఆయన రైతులకు రుణమాఫీ, రైతుభరోసా ఇస్తూ రైతులను రాజును చేసే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా అన్ని రంగాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చెల్లాచెదురు చేస్తే తాము వచ్చి ఒక్కొక్కటి పరిష్కరించుకుంటూ వస్తున్నామన్నారు.

# వ్యక్తిగత విమర్శలకే పరిమితం



**మొదటిపేజీ తరువాయి**

కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం సాగుతున్న ఎన్నికల ప్రచారం ప్రజా సమస్యల చుట్టూ కాకుండా పరస్పర ఆరోపణలు, వ్యక్తిగత విమర్శలకే పరిమితమైందని ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల వరకు ప్రచారంలో వినిపించిన అసభ్య పదజాలానికి ఇప్పుడిప్పుడే తెరపడిందని, కనీసం చెవులకు కొంత ప్రశాంతత దక్కిందని కవిత వ్యాఖ్యానించారు. కానీ అసలు ప్రజలకు అవసరమైన అంశాలపై చర్చ జరగడం లేదని విమర్శించారు. రాజకీయ పార్టీలు తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తామో చెప్పకుండా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ ప్రచారం చేస్తున్నాయని అన్నారు. ఈ తీరును చూసిన తర్వాత మున్సిపల్ ఎన్నికలు కూడా సర్పంచ్ ఎన్నికల మాదిరిగా పార్టీ గుర్తులు లేకుండా జరిగితే బాగుండేదన్న భావన కలిగిందని తెలిపారు.

**మౌలిక వసతులపై నిర్లక్ష్యం**

మహబూబ్‌నగర్‌లో సాగుతున్న ఎన్నికల ప్రచారాన్ని ప్రస్తావించిన కవిత, అక్కడికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ వచ్చినా, పట్టణంలో గత రెండు మూడు రోజులుగా తాగునీరు అందని పరిస్థితి ఉందని గుర్తు చేశారు. ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే నాయకులు సభలకే పరిమితమవుతున్నారని విమర్శించారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో ప్రజా రవాణా వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నదని, బస్సులు సరిగా నడవక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దయనీయంగా ఉందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు సంఖ్యలో ఉన్నప్పటికీ, పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల తల్లిదండ్రులు పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపించాల్సి వస్తోందని అన్నారు. ఇది ప్రభుత్వ విద్యపై ప్రజలకు నమ్మకం తగ్గడానికి కారణమవుతోందని పేర్కొన్నారు.

**బస్తీ దవాఖానాలు, డ్రైనేజీ సమస్యలు**

మున్సిపల్ శాఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా చూస్తున్నప్పటికీ, ఇప్పటి వరకు బస్తీ దవాఖానాలపై సమీక్ష నిర్వహించలేదని కవిత విమర్శించారు. పట్టణ ప్రాంతాల్లో ప్రజారోగ్యం పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతోందని అన్నారు. అన్ని సమస్యలకన్నా పెద్ద సమస్య డ్రైనేజీ నిర్వహణేనని చెప్పారు. పట్టణాల్లో చెత్త కుప్పలుగా పేరుకుపోయి, దుర్వాసనతో పాటు అనేక రోగాలు వ్యాపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల పేద, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా అనారోగ్యాల బారిన పడుతున్నారని తెలిపారు.

**రిటైర్డ్ ఉద్యోగుల దుస్థితి**

రాష్ట్రంలో రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని కవిత ఆరోపించారు. కరీంనగర్‌లో ఒక రిటైర్డ్ ఉద్యోగి తన ఇంటి గేటుకు 'ఇప్పటివరకు నాకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాలేదు' అంటూ ఫ్లెక్సీ కట్టి నిరసన తెలిపిన ఘటనను గుర్తు చేశారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. ఇప్పటికైనా మేధావులు, బుద్ధిజీవులు ఆలోచించి సరైన వారికి ఓటు వేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

**అండర్‌గ్రౌండ్ డ్రైనేజీపై సెటైర్లు**

రాష్ట్రంలో మొత్తం 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లు ఉన్నాయని కవిత గుర్తు చేశారు. అయితే వీటిలో కేవలం ఒకే ఒక్క మున్సిపాలిటీకి మాత్రమే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిధులు మంజూరయ్యాయని విమర్శించారు. అది కూడా ముఖ్యమంత్రికి గుంటనక్కతో ఉన్న ప్రత్యేక సంబంధం వల్ల సిద్ధిపేటకే నిధులు వచ్చాయంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో మాత్రం ప్రత్యేక వ్యక్తులకు అనుకూలంగా పనులు జరుగుతున్నాయని ఆరోపించారు.

**బడ్జెట్‌పై భారీ అంచనాలు**

ఫిబ్రవరి 26 నుంచి రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయని కవిత తెలిపారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే చివరి అవకాశం లాంటి బడ్జెట్ అని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత వచ్చే బడ్జెట్‌లన్నీ ఎన్నికల ఒత్తిడిలో ఉంటాయని అన్నారు. ప్రభుత్వం భూములు అమ్మడం ద్వారా రూ.7 వేల కోట్ల వరకు సంపాదించిందని, కానీ సంపద సృష్టిపై మాత్రం దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. దీని ఫలితంగా రాష్ట్ర రెవెన్యూ లోటు మైనస్ రూ.9 వేల కోట్లకు చేరిందని చెప్పారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు సంవత్సరానికి రూ.20 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లు పెంచుతూ రూ.35 వేల కోట్లు బడ్జెట్‌లో పెట్టాలని అన్నారు. పట్టణ ప్రాంత పేదలకు 8 లక్షల ఇళ్ల నిర్మాణానికి గాను రూ.25 వేల కోట్లు కేటాయించాలని కోరారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చే రూ.12 వేల ఆర్థిక సాయాన్ని కూడా బడ్జెట్‌లో పొందుపరచాలని సూచించారు. అలాగే కవులు, కళాకారులకు కేంద్రం అందిస్తున్న సాయానికి అనుగుణంగా రాష్ట్రం కూడా నిధులు కేటాయించాలని కోరారు.

**రుణమాఫీపై సవాల్**

రాష్ట్రంలోని రైతులందరికీ రుణమాఫీ అయిందని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నది పచ్చి అబద్ధమని కవిత మండిపడ్డారు. రైతులకు ఇంకా రుణమాఫీ పూర్తిగా జరగలేదని స్పష్టం చేశారు. సీఎం సొంత జిల్లా మహబూబ్‌నగర్‌కు రమ్మన్నా తాము సిద్ధమేనని, లేదా నిజామాబాద్‌కు రమ్మన్నా ఓకే అని సవాల్ విసిరారు. రుణమాఫీ పొందని రైతులను తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో సెక్రటేరియట్‌కు తీసుకొస్తామని ప్రకటించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజా సమస్యలు పక్కనపడి, రాజకీయ ఆరోపణలే ప్రధానంగా మారాయని కవిత వ్యాఖ్యానించారు. ప్రజలు ఆలోచించి ఓటు వేస్తేనే మార్పు సాధ్యమని ఆమె అభిప్రాయపడ్డారు.

# గోషామహల్‌లో భారీగా డబ్బు పట్టివేత!

- **భారీ మొత్తంలో నగదు పట్టుకున్న పోలీసులు**
- **ద్విచక్ర వాహనాలపై సంచులతో ప్రయాణిస్తున్న ముగ్గురు అరెస్ట్**
- **రూ.67 లక్షల నగదు స్వాధీనం చేసుకున్న గోషామహల్ పోలీసులు**
- **నిందితులు కొంతకాలంగా నగదు అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు గుర్తించిన పోలీసులు**
- **నగదు, నిందితులను ఆదాయపన్ను శాఖకు అప్పగించిన పోలీసులు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

గోషామహల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు భారీ మొత్తంలో నగదు పట్టుకున్నారు. ఫిబ్రవరి 9న సాయంత్రం గోషామహల్ గ్యాన్‌బాగ్ కాలనీలోని గోకుల్ గోల్డ్ ఎలక్ట్రిక్ ఐటమ్స్ షాప్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలపై అనుమానాస్పదంగా సంచులతో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా వీరిని ఆపి పరిశీలించగా.. సంచుల్లో భారీగా డబ్బు ఉన్నట్లు బయటపడింది.

తనిఖీలో మూడు సంచుల్లో భారీ మొత్తంలో నగదు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మొత్తం నగదు విలువ రూ.76,87,650గా నిర్ధారణైంది. నగదు తరలింపు తీరు అనుమానాస్పదంగా ఉండటంతో పోలీసులు వెంటనే చర్యలు చేపట్టారు. అనుమానితులను జ్యోతిరామ్, గణపతి రామ్, మహేందర్‌లుగా పోలీసులు గుర్తించారు. ముగ్గురినీ గోషామహల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి నగదుపై విచారణ చేపట్టారు. విచారణ సమయంలో అనుమానితులు పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో పాటు నగదుకు సంబంధించిన ఎలాంటి ధ్రువీకరణ




పత్రాలను సమర్పించలేకపోయారు. దీంతో నగదును పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటనపై గోషామహల్ ఇన్‌స్పెక్టర్ స్పందిస్తూ.. స్వాధీనం చేసుకున్న నగదును ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు. అక్రమ నగదు తరలింపులపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

## రాజుల తండాలో దేశీదారు అమ్మకందారిపై కేసు

- **115 దేశీదారు బాటిళ్లు స్వాధీనం**

**ఆదిలాబాద్ జిల్లా ఫిబ్రవరి 10 (ప్రజాస్వరం)**

ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని రాజుల తండా గ్రామంలో ఎక్సైజ్ అధికారులు శనివారం నిర్వహించిన సోదాల్లో అక్రమంగా దేశీదారు మద్యం అమ్ముతున్న వ్యక్తిని పట్టుకున్నారు. మహారాష్ట్రకు చెందిన సబుల్ విష్ణున్ సింగ్ (S/o రథన్ సింగ్) అనే వ్యక్తి దేశీదారు మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద నుంచి మొత్తం 115 (90 ఎంఎల్) దేశీదారు బాటిళ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎం.డి. జుల్ఫీకర్ అహ్మద్ తెలిపారు. ఈ దాడుల్లో ట్రైనీ సబ్ ఇన్స్పెక్టర్ వి. శ్రీనివాస్, ఎక్సైజ్ సిబ్బంది కార్తీక్, మొహమ్మద్, అరుణ, మంజుల పాల్గొన్నారు. అక్రమంగా గంజాయి, బెల్లం, పటిక, దేశీదారు, గుడుంబా కలిగి ఉన్నా, అమ్మినా లేదా రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు.



# పోలింగ్ ప్రశాంతంగా జరగాలి..

- **కలెక్టర్ రాహుల్ రాజ్..**

**తూప్రాన్ ఫిబ్రవరి 10 (ప్రజా స్వరం)**



తూప్రాన్ మున్సిపల్ పోలింగ్ ప్రశాంతంగా జరగాలి జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ తెలిపారు మున్సిపల్ ఎన్నికల్లో పోలింగ్ ప్రశాంతంగా శాంతి యుత వాతావరణం లో జరగాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. తూప్రాన్ పట్టణంలోని నోబుల్ ఫార్మసీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..మున్సిపల్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని, ఎన్నికల సిబ్బంది ఎన్నికల సంఘం నియమాలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్ జడ్పీ సీఈఓ ఎల్లయ్య,ఆర్డీవో జయచంద్ర రెడ్డి,మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి.టౌన్ ప్లానింగ్ అధికారి సిఐ రంగా కృష్ణ ఎసై గంగారాజు లు పాల్గొన్నారు.



## గుర్తుతెలియని మహిళ అస్తికలు లభ్యం

**చిన్న శంకరంపేట ఫిబ్రవరి 10 ( ప్రజాస్వరం)**

చిన్న శంకరంపేట మండలం చందాపూర్ గ్రామ శివారులో మనిషి అస్తికలు ఉన్నట్టు పోలీసులకు సమాచారం రావడంతో స్పందించిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు గుర్తుతెలియని మహిళ అస్థికలు లభ్యం అయినట్లు వారు సూచించారు గత సంవత్సరం ఆగస్టు నెలలో మనోహరాబాద్ మండలం పరికిబండ గ్రామానికి చెందిన కవిత అనే మహిళ తప్పిపోయినట్లు కేసు నమోదు కావడంతో ఆ మహిళ శవమే కావచ్చు అని పోలీసులు భావిస్తున్నట్లు తెలిపారు. నేర స్థలంలో మృతురాలికి చెందిన చీర, జాకెట్, ఒక పుస్తె, లభించినట్లు పోలీసులు తెలిపారు.

## పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ చేసిన సర్పంచ్ ప్రియా నాయక్....

**చిన్న శంకరంపేటఫిబ్రవరి 10 (ప్రజాస్వరం)**

చిన్న శంకరంపేట మండలం ఖాజాపూర్ తాండ గ్రామంలో పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి స్థానిక సర్పంచ్ ప్రియా నాయక్ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు, ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవళిక ఉపసర్పంచ్ మాట్లాడుతూ ఖాజాపూర్ తాండ పాఠశాల ప్రహరీ గోడ లేక పిల్లలకు చాలా ఇబ్బందులు ఎదురయ్యాయని రోడ్డు పక్కనే పాఠశాల ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు గ్రామస్థులను కూడా పిల్లలకు ఏ సమయంలో ఏ ఆపద జరుగుతుందని భయపడే వాళ్ళమని వారన్నారు 10 లక్షల రూపాయలు మంజూరు కావడంతో ప్రహరీ గోడ నిర్మాణానికి పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్రియా నాయక్, ఉప సర్పంచ్ నరేష్ నాయక్, ప్రధానోపాధ్యాయులు ప్రవళిక, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, పాలకవర్గ సభ్యులు సువాలి, ఇస్రా నాయక్, రాజు నాయక్, కనకదుర్గ, లాల్యా నాయక్, సంఘ్యా నాయక్, మోతిలాల్, స్వామి, శంకర్, తాండ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు



## భూ బాధితుల సమస్యను పరిష్కరించండి

**మనోహరాబాద్ (ప్రజాస్వరం) :**

మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి పారిశ్రామికవాడ అభివృద్ధికి భూములిచ్చిన రైతులకు తక్షణమే పరిహారం అందేలా చూడాలని ఆ గ్రామ సర్పంచ్ రాజనర్సింహా కోరారు. మంగళవారం తహశీల్దార్ ఆంజనేయులును కలిసి వినతిపత్రం అందజేశారు. బాధితులకు న్యాయం చేయాలని విన్నవించగా, తహసీల్దార్ సానుకూలంగా స్పందించారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు సాదు సత్యానారాయణ, పాల్గొన్నారు. అనంతరం తహశీల్దార్ను సర్పంచ్ బృందం సన్మానించింది.



## టీ మాందాపూర్ లో ఈజీఎస్ గ్రామసభ.....

**చిన్న శంకరంపేట ఫిబ్రవరి 10( ప్రజాస్వరం)**

చిన్న శంకరంపేట మండలం టి మాందాపూర్ గ్రామంలో స్థానిక సర్పంచ్ బి మరి రాని ఆధ్వర్యంలో మంగళవారం సామాజిక తనిఖీ గ్రామ సభను నిర్వహించారు గత సంవత్సర కాలంలో గ్రామంలో నిర్వహించిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ బృందం సభ్యులు వివరించారు, నిధుల వినియోగం పనుల నిర్వహణ పై ఆడిట్ వివరాలను వెల్లడించారు, ఈజిఎస్ పనులపై ప్రజల అభిప్రాయాలను అడిగి నమోదు చేసుకున్నారు, టీ మాందాపూర్ తో పాటు మండలంలోని జంగారై చందంపేట వివిధ గ్రామాలలో ఈజీఎస్ గ్రామసభలు నిర్వహించి ఏడాది కాలంలో నిర్వహించే పనులపై ప్రజల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు ఈ కార్యక్రమంలో టి మాదాపూర్ సర్పంచ్ బిమరి రాణిగనేష్ జంగారాయి సర్పంచ్ గోపాల్ రెడ్డి, చందంపేట సర్పంచ్ ప్రవీణ్ కుమార్, పాల్గొన్నారు,



## ప్రభుత్వం నేరుగా వేతనాలు చెల్లించాలి

- **ఏజెన్సీ విధానాన్ని తొలగించి కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలి**
- **తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్**

**సిద్దిపేట ఫిబ్రవరి 10(ప్రజాస్వరం):**

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం నేరుగా వేతనాలు అందించాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఏకలవ్య భవనంలో మెడికల్ అండ్ హెల్త్ ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రభుత్వం నేరుగా కాకుండా ఏజెన్సీల ద్వారా వేతనాలు అందించడంతో తీవ్రంగా నష్టపోతున్నారు అన్నారు. అంతేకాకుండా ఔట్సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సానిటేషన్, పేషంట్ కేర్ విభాగంలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు రూ. 20వేల రూపాయలకు తగ్గకుండా వేతనం అందించాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు స్లాబ్ సిస్టమ్ తొలగించి క్యాడర్ బేసిక్ వేతనం ఇవ్వాలన్నారు. సంవత్సరాలనుండి పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రస్తుతం నియామకమైన ఔట్ సోర్సింగ్ ఉద్యోగికి ఒకే రకమైన వేతనం కాకుండా సంవత్సరానికి 10 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలన్నారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఐక్యంగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభాష్, వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీయొద్దీన్, అసోసియేట్ అధ్యక్షులు Dr శాంతి కుమార్, స్వామి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా బోనాల ఊరేగింపు....

**చిన్న శంకరంపేట ఫిబ్రవరి 10 ( ప్రజాస్వరం )**

చిన్నశంకరంపేట మండలంలోని సూరారం గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా రేణుకమాత ఏల్లమ్మ తల్లికి భోనం సమర్పించారు. మూడు రోజులుగా రేణుకమాత ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు,



## ప్రజా సమస్యల పరిష్కారమే తన బాధ్యత

- **ఎమ్మెల్యే తలసాని**

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 10 ( ప్రజాస్వరం ):**

ప్రజా సమస్యల పరిష్కారమే తన బాధ్యత అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం బన్సీలాల్‌పేట డివిజన్‌లో పర్యటించిన ఆయన, బీజేఆర్ నగర్‌లో ₹4.50 లక్షల వ్యయంతో వాటర్ పైప్‌లైన్ పనులు ప్రారంభించారు. వివేకానంద కాలనీ పార్కును కార్పొరేటర్ కుర్మ హేమలతతో కలిసి ప్రారంభించారు. సున్నం బట్టీలో బోర్ మరమ్మతులపై స్థానికులు వినతి చేయగా, వెంటనే పనులు చేపట్టి ప్రజలకు వినియోగంలోకి తేవాలని వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే పరామర్శ**

బీఆర్ఎస్ నాయకుల కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. IDH కాలనీకి చెందిన సోని, బన్సీలాల్‌పేటకు చెందిన సీనియర్ బీఆర్ఎస్ మైనార్టీ విభాగం నాయకులు అబ్బాస్ మాతృమూర్తుల మృతిపై వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# సెకన్ల పాటు భూమి కదలికలు... గాజులరామారం ఆదర్శనగర్ ప్రజల్లో భయం












- **పాఠశాలల నుంచి బయటకు పరుగులు తీసిన విద్యార్థులు**
- **కుత్బుల్లాపూర్‌లో భూమి కంపనం... ఆదర్శనగర్‌లో ఒక్కసారిగా కలకలం!**

**కుత్బుల్లాపూర్,ఫిబ్రవరి 10(ప్రజాస్వరం):**

కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం ఆదర్శనగర్‌లో మంగళవారం ఉదయం ఒక్కసారిగా కలకలం చోటుచేసుకుంది.ఉదయం సుమారు 10 గంటల సమయంలో కొన్ని సెకండ్ల పాటు భూమి కంపించినట్లు స్థానికులు తెలిపారు. అకస్మాత్తుగా భూమి షేక్ అయినట్లు అనిపించడంతో భయభ్రాంతులకు గురైన ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వీడియోల్లో ఓ పాఠశాల నుంచి చిన్నపిల్లలు తీవ్ర భయంతో తరగతుల నుంచి బయటకు పరుగులు తీస్తున్న దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అలాగే అపార్ట్మెంట్లలో ఒక్కసారిగా శబ్దం రావడంతో ప్రజలు బయటకు పరుగులు తీస్తున్న సీసీటీవీ ఫుటేజ్ కూడా రికార్డు అయింది. భూమి కంపించడంతో స్థానిక పాఠశాలల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. తరగతి గదుల్లో ఉన్న చిన్నపిల్లలు, ఉపాధ్యాయులు భయంతో మైదానంలోకి పరుగులు తీశారు. భద్రతా దృష్ట్యా కొన్ని స్కూళ్లకు తాత్కాలికంగా హాలిడే కూడా ప్రకటించారు. ఈ ఘటనలో ఇప్పటివరకు ఎలాంటి ఆస్తి నష్టం లేదా ప్రాణనష్టం జరగలేదని అధికారులు స్పష్టం చేశారు. అయితే భూమి కంపించడానికి గల కారణంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఇది రిక్టర్ స్కేల్‌పై నమోదైన భూకంపమా? లేక సమీప ప్రాంతాల్లో ఉన్న క్వారీల బ్లాస్టింగ్‌లు లేదా భూగర్భ జలాల మార్పుల వల్ల జరిగిన ప్రకంపనమా? అన్న అంశంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (NGRI) నిపుణులు, సంబంధిత అధికారులు పరిశీలన చేపట్టాల్సి ఉందని స్థానికులు కోరుతున్నారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## నివాళులర్పించిన ఎమ్మెల్సీ నెల్లి కంటి సత్యం

**వలిగొండ,ఫిబ్రవరి 10(ప్రజాస్వరం):**

యాదాద్రి భువనగిరి జిల్లా టిఆర్ఎస్ మాజీ పోలీట్ బ్యూరో సభ్యులు మావోయిస్టు పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి కోనపురి సాంబశివుడు, తెరాస నాయకులు కొనపురి రాములు గారి అమ్మ కోనపురి లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించి. తమ కుటుంబానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ధైర్యం చెప్పారు




## మానవత్వాన్ని చాటుకున్న శివ స్వాములు

**మక్తల్,ఫిబ్రవరి 10(ప్రజాస్వరం):**

వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామానికి చెందిన తెలుగు హనుమంతు ఇటీవల శివైక్యం చెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే శివ స్వాములు స్పందించి, వారి ఆధ్వర్యంలో మానవత్వాన్ని ప్రతిబింబించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సద్గురు జగదీశ్ చారి, శ్రీనివాస్ రెడ్డి, కర్ణాకర్, భీమన్న, ఆంజనేయులు, వీరేష్ తదితర శివ స్వాములు పాల్గొని, మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం హిందూ ధర్మ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివ స్వాములు మాట్లాడుతూ తెలుగు హనుమంతు జీవితం ధర్మబద్ధంగా సాగిందని, ఆయన సంకల్పం గ్రామానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను కొనసాగిస్తూ, హిందూ ధర్మ పరిరక్షణకు కట్టుబడి ఉండాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి సందర్భాల్లో ఎవ్వరూ మొహమాటం పడకుండా ముందుకు వచ్చి బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని శివ స్వాములు సూచించారు. మానవత్వమే అసలైన ధర్మమని, సమాజంలో ఐక్యత, సహానుభూతి పెంపొందాలంటే ఇలాంటి సేవా కార్యక్రమాలు అవసరమని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని శివ స్వాముల సేవాభావాన్ని అభినందించారు



## 12న జరుగు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి.

- **సిర్పంగి స్వామి సిపిఎం మండల కార్యదర్శి**

**వలిగొండ,ఫిబ్రవరి 10(ప్రజాస్వరం):**



యాదాద్రి భువనగిరి జిల్లా ఈనెల 12న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు రైతులు,కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి ప్రకటనలో కోరారు .
కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్ ల రద్దుకై, విబి జి రామ్ జీ చట్టాన్ని రద్దు చేస్తూ మాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని,నూతన విద్యుత్ బిల్లుల చట్టాన్ని, నూతన విత్తన చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని రిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు రైతులు వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు .కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన రెండోసారి కార్పొరేట్ల లాభార్జన ధ్యేయంగా వ్యవహరిస్తూ కార్మిక, రైతుల హక్కులను కాలరాస్తూ పోరాడి సాధించుకున్న బ్రిటిష్ కాలం నాటి చట్టాలను రద్దు చేస్తుందని అన్నారు. యూపీఏ 1 వామపక్షాలతో కూడిన ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ విబి జి రాంజీ చట్టాన్ని తీసుకొస్తూ విధుల కేటాయింపును రాష్ట్రాలపై నెట్టుతూ తప్పుకునేందుకు కూలీలకు పనులు లేకుండా చేసేందుకు వ్యవహరిస్తుందని ప్రజలందరూ వీటన్నిటిని అర్థం చేసుకుని 12న జరిగే దేశ సార్వత్రిక సమ్మెలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## కుషాయిగూడలో మిస్సింగ్ కేసు నమోదు

**కుషాయిగూడ,ఫిబ్రవరి 10 (ప్రజాస్వరం):**



కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. మౌలాలి హెచ్‌బీ కాలనీ ఇంద్రానగర్‌కు చెందిన రేణుక ఫిర్యాదు మేరకు ఈ కేసు వెలుగులోకి వచ్చింది. ఆమె కుమార్తె ఎస్. పావని (19) సోమవారం ఉదయం ఉద్యోగానికి వెళ్లింది. సాయంత్రం 6 గంటల సమయంలో తల్లికి ఫోన్ చేసి ఆలస్యంగా వస్తున్నానని తెలిపింది. అనంతరం రాత్రి 8 గంటలకు మళ్లీ కాల్ చేసి తాను బస్‌స్టాప్‌లో ఉన్నానని, త్వరలో ఇంటికి వస్తానని చెప్పింది. ఆ తర్వాత పావనికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తల్లి రేణుక పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




## క్రీడాకారులను అభినందించిన ఉపాధ్యాయ బృందం

**వలిగొండ,ఫిబ్రవరి 10(ప్రజాస్వరం):**

భువనగిరి జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడోత్సవాలలో భాగంగా శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాల వలిగొండ కు చెందిన క్రీడాకారులు కబడ్డీ విభాగంలో s. నవ్య,A.జైపాల్,m. దీక్షిత,. మరియు క్యారమ్స్ విభాగంలో బి.వర్ధన్ రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలకు ఎంపిక అయినట్లు ప్రధానోపాధ్యాయులు ఎస్ .భాస్కర్, వ్యాయామ ఉపాధ్యాయు లు జి .స్వామి రాజు, ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు, రాష్ట్ర మరియు జాతీయ స్థాయి లో రాణించాలని క్రీడలలో మంచి భవిష్యత్తు ఉందని ప్రతి విద్యార్థి క్రీడలలో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పి. నాగేందర్, సైదారెడ్డి,జిలాని, మల్లేష్,లింగయ్య,స్వామి, శివాజీ,మరియు ఉపాధ్యాయ బృందం క్రీడాకారులను అభినందించారు.

## మీడియేషన్ డ్రైవ్ 2.0తో కేసులకు వేగవంత పరిష్కారం

**కుషాయిగూడ,ఫిబ్రవరి 10 (ప్రజాస్వరం):**

సుప్రీంకోర్టు, తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు 'మీడియేషన్ ఫర్ నేషన్ - మీడియేషన్ డ్రైవ్ 2.0' కార్యక్రమాన్ని మల్కాజిగిరి జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. బాల భాస్కర రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా సులభంగా, వేగంగా పరిష్కరించుకునేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని అన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, స్నేహపూర్వక వాతావరణంలో సమస్యలకు పరిష్కారం కనుగొనాలని సూచించారు. అలాగే న్యాయస్థానాలపై భారం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ మీడియేషన్ డ్రైవ్‌ను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.




## బ్యాలెట్ బాక్సుల పంపిణీ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ

- **ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి:ఎస్పీ రోహిత్ రాజు**

**భద్రాద్రి కొత్తగూడెం,ఫిబ్రవరి 10(ప్రజాస్వరం):**

జిల్లాలోని కొత్తగూడెం కార్పొరేషన్,ఇల్లందు,అశ్వారావుపేట మున్సిపాలిటీలకు బుధవారం జరగనున్న పోలింగ్ నేపథ్యంలో పటిష్టమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు.ఇందులో భాగంగా పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలనందు ఏర్పాటు చేసిన బ్యాలెట్ బాక్సుల పంపిణీ కేంద్రాలను జిల్లా ఎస్పీ పరిశీలించారు.అక్కడ విధులలో ఉన్న అధికారులు,సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలింగ్ కేంద్రాల వద్ద 1200 మందితో భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.పోలింగ్ కేంద్రాల పరిసరాలలో నిరంతర నిఘా కొరకు ప్రత్యేక బృందాలను నియమించడం జరిగిందన్నారు.ఓట్ల లెక్కింపు కేంద్రమైన పాల్వంచ అనుబోస్ కళాశాల పరిసర ప్రాంతాలను డాగ్స్ స్క్వాడ్,బాంబుస్క్వాడ్ తో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని అన్నారు.ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.



## ఉప్పల్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ఉప్పల్,ఫిబ్రవరి 10(ప్రజాస్వరం):**



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, శాసనమండలి సభ్యులు పట్నం మహేంద్ర రెడ్డి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత కాలంలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, , నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేడే మున్సిపల్ పోలింగ్



**మొదటిపేజీ తరువాయి**

పోలింగ్ జరుగుతుంది. మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో 414 వార్డులు ఉండగా, మిగిలిన 116 మున్సిపాలిటీల్లో 2,582 వార్డులు ఉన్నాయి. ఈ అన్ని వార్డుల్లో అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ప్రతి వార్డు నుంచి ఒక సభ్యుడిని ప్రజలు ఎన్నిక చేయనున్నారు. ఈ 123 పట్టణ సంస్థల్లోని ఓటర్ల సంఖ్య కూడా భారీగానే ఉంది. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో సుమారు 52 లక్షల మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరి కోసం దాదాపు 8 వేలకుపైగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు. నేడు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. ఓటర్లు క్యూలలో నిలబడి ప్రశాంతంగా ఓటు వేసేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వృద్ధులు, వికలాంగులు, గర్భిణీ మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

ఈ మున్సిపల్ ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీకి కీలకంగా మారాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరుగుతున్న తొలి పెద్ద పట్టణ ఎన్నికలు కావడంతో, ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న అభిప్రాయం ఈ ఫలితాల్లో ప్రతిబింబిస్తుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.ప్రతిపక్ష బీఆర్ఎస్ కూడా ఈ ఎన్నికలను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. గతంలో మున్సిపాలిటీలపై బలమైన పట్టు కలిగిన పార్టీగా, మళ్లీ అదే స్థాయిలో స్థానాలను నిలుపుకోవాలని ప్రయత్నించింది. పట్టణాల్లో గత పాలనలో చేసిన అభివృద్ధిని గుర్తుచేస్తూ ప్రచారం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణాలను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపిస్తూ ప్రజల్లోకి వెళ్లింది.

బీజేపీ కూడా ఈ ఎన్నికల్లో గట్టిగా పోటీ చేసింది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో తన బలాన్ని పెంచుకునే లక్ష్యంతో అభ్యర్థులను నిలిపింది. కేంద్ర ప్రభుత్వ పథకాలు, పట్టణాభివృద్ధి కార్యక్రమాలను ప్రచారంలో ముందుకు తెచ్చింది. కొన్ని మున్సిపాలిటీల్లో మూడుముఖాల పోటీ నెలకొనగా, మరికొన్ని చోట్ల ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే పోటీ కనిపిస్తోంది.ఈసారి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులు, చిన్న పార్టీల అభ్యర్థులు కూడా పెద్ద సంఖ్యలో బరిలో ఉన్నారు. స్థానిక సమస్యలను ప్రధానంగా తీసుకుని వారు ప్రజలను ఆకర్షించే ప్రయత్నం చేశారు. తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, పారిశుద్ధ్యం వంటి సమస్యలు చాలా చోట్ల ప్రధాన ఎన్నికల అంశాలుగా మారాయి.

ఎన్నికల ప్రచారం ముగిసిన తరువాత పోలింగ్ ఏర్పాట్లపై అధికారులు పూర్తి దృష్టి సారించారు. సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ అదనపు పోలీసు బలగాలను మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు తీసుకున్నారు. వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాల ద్వారా పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించనున్నారు.ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో, ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. మద్యం, నగదు పంపిణీని అడ్డుకునేందుకు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. పోలింగ్ రోజున ఎలాంటి ప్రచారం జరగకుండా చర్యలు తీసుకున్నారు.ఈ ఎన్నికల్లో మొత్తం సుమారు 13 వేల మందికి పైగా అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరిలో ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు కూడా ఉన్నారు. ప్రతి వార్డులో పోటీ తీవ్రంగా ఉంది. కొన్ని వార్డుల్లో సన్నిహిత పోటీ ఉండగా, మరికొన్ని చోట్ల ఒక పార్టీకి ఆధిక్యం కనిపిస్తున్నట్టు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం చూపనున్నాయి. పట్టణ ఓటర్ల మనోభావాలు ఏ వైపు ఉన్నాయన్నది ఈ ఫలితాలతో స్పష్టమవుతుంది. రాబోయే రోజుల్లో జరిగే ఇతర స్థానిక సంస్థల ఎన్నికలకు కూడా ఇవి దిశానిర్దేశం చేయనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం పిలుపునిచ్చింది. ప్రజాస్వామ్యానికి మున్సిపల్ ఎన్నికలు ఎంతో ముఖ్యమని, పట్టణ పాలనలో ప్రజల భాగస్వామ్యం పెరగాలనే లక్ష్యంతో ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. తెలంగాణలో రేపు జరగనున్న మున్సిపల్ పోలింగ్ రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారింది. 123 పట్టణ సంస్థల్లో, 2,996 వార్డుల్లో జరిగే ఈ ఎన్నికలు ప్రజల తీర్పును ప్రతిబింబించనున్నాయి. పోలింగ్ అనంతరం వెలువడే ఫలితాలపై రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది.

# కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం

**మొదటిపేజీ తరువాయి**

వ్యక్తం చేశారు. జనవరి 31 నాటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తనకు కేటాయించిన వాటా నీళ్లను పూర్తిగా వినియోగించుకుందని, ప్రస్తుతం ఏపీ వాడుకుంటున్న నీళ్లన్నీ తెలంగాణ వాటాకు చెందినవేనని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి చేతులు ముడుచుకుని కూర్చున్నారని మండిపడ్డారు.

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు, కృష్ణా నదిపై తాత్కాలిక ఒప్పందం ప్రకారం ఏపీకి కేవలం 66 శాతం నీళ్లను మాత్రమే వినియోగించుకునే హక్కు ఉందని చెప్పారు. కానీ ఆ ఒప్పందాన్ని లెక్కచేయకుండా ఏపీ ఇప్పటికే 80 శాతం వరకు నీళ్లు వినియోగించుకుందని ఆరోపించారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు.

చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లు ప్రభుత్వ పెద్దలు కేవలం లేఖలు రాయడమే తప్పించి వాస్తవంగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కృష్ణా జలాల అంశంపై అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని కోరే ధైర్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేదని, తన రాజకీయ గురువుల భయంతోనే ఆయన నోరు మెదపడం లేదని ఆరోపించారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి ఏపీ నిర్బంధం లేకుండా నీళ్లు తరలించుకుపోతుంటే, సీఎం మాత్రం జూబ్లీహిల్స్‌లో కూర్చుని చూస్తున్నారని అన్నారు.

ఏపీ ప్రభుత్వం ఎలాంటి ఇండెంట్లు లేకుండా, బోర్డు అనుమతులు తీసుకోకుండా కృష్ణా నీళ్లను తరలించుకుపోతున్నదని హరీశ్ రావు ఆరోపించారు. తాను చెప్పేది రాజకీయ ఆరోపణ కాదని, పూర్తి ఆధారాలతోనే మాట్లాడుతున్నానని స్పష్టం చేశారు. తెలంగాణ ఇరిగేషన్ శాఖ కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు లేఖ రాసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఆ లేఖ ప్రకారం ఏపీ ఇప్పటికే 664 టీఎంసీల నీటిని వినియోగించుకుందని తెలిపారు. ఇది మొత్తం కృష్ణా నీళ్లలో దాదాపు 80 శాతం అవుతుందని వివరించారు.జనవరి 28 నాటికే తాత్కాలిక ఒప్పందం ప్రకారం నిర్ణయించిన 66:34 నిష్పత్తిని ఏపీ దాటిపోయిందని, ఇంకా రెండు రోజుల్లోనే ఏపీ వినియోగం పూర్తి స్థాయిలో వాటాను మించిపోతుందని తెలంగాణ ఈఎన్సీ కేఆర్ఎంబీకి లేఖ రాసిందన్నారు. వెంటనే బోర్డు సమావేశం ఏర్పాటు చేసి ఏపీ నీటి వినియోగాన్ని నియంత్రించాలని ఆ లేఖలో స్పష్టంగా పేర్కొన్నట్టు తెలిపారు.

అయితే జనవరి 28న లేఖ రాసిన ఈఎన్సీ, జనవరి 31న పదవీ విరమణ చేశారని, ఆ తర్వాత వారం రోజుల పాటు ఆ కీలక పోస్టును ప్రభుత్వం ఖాళీగా ఉంచిందని హరీశ్ రావు గుర్తు చేశారు. ఏపీ లెక్కకు మించి నీళ్లు తీసుకుపోతుంటే, అత్యంత కీలకమైన ఈఎన్సీ పోస్టును ఎందుకు భర్తీ చేయలేదని ప్రశ్నించారు. వారం రోజుల తర్వాత మీడియా ప్రశ్నలు లేవనెత్తిన తర్వాతే ప్రభుత్వం ఆ పోస్టును భర్తీ చేసిందని ఆరోపించారు. ఈఎన్సీ కేఆర్ఎంబీ సభ్యుడే అయినప్పుడు, ఆ పోస్టును ఖాళీగా ఉంచడం వెనుక అసలు కారణం ఏమిటని ఆయన నిలదీశారు.వేసవికాలంలో తెలంగాణకు అవసరమైన నీటి అవసరాలపై ఈ ప్రభుత్వానికి బాధ్యత లేదా అని హరీశ్ రావు ప్రశ్నించారు. తాత్కాలిక ఒప్పందం ప్రకారం తెలంగాణ కనీసం 34 శాతం నీటిని వినియోగించుకోవాల్సి ఉండగా, ప్రస్తుతం కేవలం 20 శాతం మాత్రమే వినియోగిస్తున్న పరిస్థితి ఉందని తెలిపారు. ఈ రోజుకీ ఏపీ రోజుకు సుమారు 1.5 టీఎంసీల నీటిని తీసుకుపోతుంటే, తెలంగాణలో పంటల పరిస్థితి ఏమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో పంటలకు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం దీనిపై ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇది ప్రభుత్వం నడుపుతున్న పరిస్థితినా, లేక సర్కస్ నడుపుతున్న పరిస్థితినా అర్థం కావడం లేదని ఆయన మండిపడ్డారు.వరుసగా రెండు సంవత్సరాలుగా కృష్ణా జలాలను అత్యల్పంగా వినియోగించుకుంటూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబుకు రాజకీయంగా ఉపకారం చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. ఇది గురు దక్షిణ చెల్లించినట్లేనని వ్యాఖ్యానించారు. ఈ ఏడాది కూడా తెలంగాణ నీటి వినియోగం 20 శాతం దాటలేదని, ఇది ప్రభుత్వ వైఫల్యానికి స్పష్టమైన నిదర్శనమన్నారు.



రాష్ట్ర హక్కులను కాపాడాల్సిన ముఖ్యమంత్రి, వాటినే కాలరాస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డికి పాలన మీద పట్టు లేదని, నీటి వనరులపై అవగాహన లేకుండా పాలన సాగుతోందని విమర్శించారు. ఈ పరిస్థితిలో ముఖ్యమంత్రి తెలంగాణకు శాపంగా మారుతున్నారని హరీశ్ రావు తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించారు.ఈఎన్సీ కేఆర్ఎంబీకి రాసిన లేఖలో ఏపీ 664 టీఎంసీలు వినియోగించిందని పేర్కొనగా, కేఆర్ఎంబీ నుంచి వచ్చిన లేఖలో మాత్రం ఏపీ కేవలం 555 టీఎంసీలే వాడిందని చెప్పడంపై హరీశ్ రావు అనుమానం వ్యక్తం చేశారు. దాదాపు వంద టీఎంసీల తేడా ఎలా వచ్చిందని ప్రశ్నించారు. అడగాల్సిన ముఖ్యమంత్రి అడగడంలేదని, తెలంగాణ హక్కులను కాపాడాల్సిన కేఆర్ఎంబీ ఏపీని ప్రశ్నించడం లేదని ఆరోపించారు. కేఆర్ఎంబీ కేంద్ర ప్రభుత్వ, ముఖ్యంగా బీజేపీ ప్రభావంలో పనిచేస్తోందని విమర్శించారు.

రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేసీఆర్‌పై విమర్శలు చేయడం తప్ప, నీళ్ల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. స్కాంలు బయటపడతాయనే భయంతో సీఎం రేవంత్ రెడ్డి మౌనంగా ఉంటున్నారని, బీజేపీ కూడా అదే విధంగా మౌనం పాటిస్తోందని ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ కలిసి తెలంగాణకు ఉద్దేశ్యపూర్వకంగా అన్యాయం చేస్తున్నాయని అన్నారు.చంద్రబాబు, రేవంత్ రెడ్డి మధ్య రాజకీయ స్నేహం ఉండొచ్చని, కానీ రాష్ట్ర హక్కులను ఆంధ్రప్రదేశ్‌కు రాసివ్వడం ఏ విధంగా సమర్థనీయమని ప్రశ్నించారు. తెలంగాణ ప్రయోజనాలపై జరుగుతున్న ఈ నిర్లక్ష్యాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు.

రాష్ట్ర హక్కులు దెబ్బతింటే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని, త్వరలో కేఆర్ఎంబీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హరీశ్ రావు ప్రకటించారు. కేంద్ర మంత్రులను కలిసి ఈ అంశాన్ని పార్లమెంట్‌లో గట్టిగా లేవనెత్తుతామని తెలిపారు. రాష్ట్రం నుంచి ఉన్న 16 మంది బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు తెలంగాణ నీటి హక్కులను కాపాడటంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్ర నీటి హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని, గతంలో 19 చోట్ల టెలిమెట్రీ వ్యవస్థలు ఏర్పాటు చేసిన తమ ప్రభుత్వం పని తీరును గుర్తు చేశారు. మిగిలిన తొమ్మిది చోట్ల టెలిమెట్రీలు ఏర్పాటు చేయడంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వం వెంటనే స్పందించాల్సిన అవసరం ఉందని, లేదంటే ప్రజల తరఫున పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హరీశ్ రావు హెచ్చరించారు.

# లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాసం

**మొదటిపేజీ తరువాయి**

కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు చేస్తోంది.

**118 మంది ఎంపీల సంతకాలు**

కాంగ్రెస్ వర్గాల ప్రకారం ఈ అవిశ్వాస తీర్మానానికి మొత్తం 118 మంది ఎంపీలు సంతకాలు చేశారు. భారత రాజ్యాంగంలోని అధికరణ 94(సి) ప్రకారం లోక్‌సభ స్పీకర్‌ను తొలగించాలంటే కనీసం 14 రోజుల ముందు నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. ఆ గడువు పూర్తయిన తర్వాతే సభలో తీర్మానాన్ని చర్చకు తీసుకొని ఆమోదించాల్సి ఉంటుంది. ఈ నిబంధనలకు అనుగుణంగానే కాంగ్రెస్ పార్టీ నోటీసు సమర్పించినట్లు తెలిపింది.గత కొన్ని రోజులుగా లోక్‌సభలో చోటుచేసుకున్న పరిణామాలు, వరుస వాయిదాలు, విపక్షాల వాదనలకు అవకాశం ఇవ్వకపోవడం వంటి అంశాలపై విపక్షాలు తీవ్ర అసంతృప్తితో ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. విపక్ష నేతల మధ్య సుదీర్ఘ చర్చల అనంతరం అవిశ్వాస తీర్మానం దిశగా వెళ్లాలని నిర్ణయించినట్లు సమాచారం.

**స్పీకర్ తీరుపై కాంగ్రెస్ ఆరోపణలు**

స్పీకర్ ఓం బిర్లా వ్యవహారశైలి పూర్తిగా పక్షపాతంగా ఉందని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. ముఖ్యంగా విపక్ష నేత రాహుల్ గాంధీకి సభలో మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని కాంగ్రెస్ వాదిస్తోంది. కీలక జాతీయ, అంతర్జాతీయ అంశాలపై మాట్లాడాలన్న రాహుల్ గాంధీ అభ్యర్థనలను పదేపదే తిరస్కరించారని ఆరోపించింది.ఇక ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలను సస్పెండ్ చేయడం కూడా రాజకీయ ప్రేరణతో కూడిన నిర్ణయమేనని పార్టీ పేర్కొంది. సభలో ప్రభుత్వం వైఫల్యాలను ప్రశ్నించినందుకే ఈ సస్పెన్షన్లు విధించారని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. అదే విధంగా కాంగ్రెస్ మహిళా ఎంపీలు ప్రధాని పై దాడి చేసే అవకాశం ఉందన్నట్టుగా స్పీకర్ వ్యాఖ్యానించడంపై కూడా కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి వ్యాఖ్యలు మహిళా ఎంపీల గౌరవాన్ని కించపరిచేలా ఉన్నాయని ఆరోపించింది.

**రాహుల్ కి అవకాశం ఇవ్వలేదన్న ఆవేదన**

భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన కొన్ని కీలక అంశాలను రాహుల్ గాంధీ స్పీకర్ దృష్టికి తీసుకెళ్లాలని భావించినా, అందుకు అనుమతి ఇవ్వలేదని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. దేశ ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై చర్చ జరగాల్సిన అవసరం ఉన్నప్పటికీ, ప్రభుత్వం అసౌకర్యంగా భావించే విషయాలను సభలో ప్రస్తావించనివ్వడం లేదని ఆరోపించారు.పార్లమెంట్‌ను కేవలం ప్రభుత్వ వేదికగా మార్చే ప్రయత్నం జరుగుతోందని విపక్ష నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల తరఫున ప్రశ్నలు అడగాల్సిన విపక్షాలకు మాట్లాడే అవకాశమే లేకుండా చేయడం ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతుందని వారు అంటున్నారు.

**ఇండియా కూటమి నిర్ణయం**


ఈ అవిశ్వాస తీర్మానానికి సంబంధించి మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో జరిగిన ఇండియా కూటమి సమావేశాల్లో కీలక నిర్ణయం తీసుకున్నారు. మొదట స్పీకర్‌కు ఫిర్యాదు లేఖ ఇవ్వాలన్న సూచన కూడా కొందరు నేతల నుంచి వచ్చినప్పటికీ, చివరికి అవిశ్వాస తీర్మానమే సరైన మార్గమని కూటమి నేతలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. సభలో జరుగుతున్న పరిణామాలకు రాజకీయంగా బలమైన సంకేతం ఇవ్వాలన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని సమాచారం.ఇండియా కూటమిలోని ఇతర విపక్ష పార్టీలు కూడా ఈ అంశంపై కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతున్నాయి. స్పీకర్ పాత్ర తటస్థంగా ఉండాలని, అలా లేకపోతే ప్రజాస్వామ్య వ్యవస్థ దెబ్బతింటుందని విపక్షాలు అంటున్నాయి.

**ప్రభుత్వ ప్రతిస్పందన**

కాంగ్రెస్ చర్యలపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పందించారు. అవిశ్వాస తీర్మానాన్ని నెగ్గించుకునేందుకు విపక్షాల వద్ద అవసరమైన సంఖ్యాబలం లేదని ఆయన వ్యాఖ్యానించారు. ఇది కేవలం రాజకీయ స్టంట్ మాత్రమేనని, స్పీకర్‌పై అవిశ్వాసం పెట్టడం ద్వారా ప్రజల్లో సానుభూతి పొందాలన్న ప్రయత్నమేనని విమర్శించారు.స్పీకర్ తన విధులను రాజ్యాంగబద్ధంగా నిర్వర్తిస్తున్నారని, సభా నిబంధనల ప్రకారమే నిర్ణయాలు తీసుకుంటున్నారని ప్రభుత్వం వాదిస్తోంది. విపక్షాలు సభను అడ్డుకోవడం వల్లే వాయిదాలు జరుగుతున్నాయని, దానికి బాధ్యత స్పీకర్‌పై వేయడం సరికాదని అధికార పార్టీ నేతలు అంటున్నారు.

**రాజకీయంగా పెరుగుతున్న ఉద్రిక్తత**

స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టడం లోక్‌సభ చరిత్రలో అరుదైన పరిణామం. ఈ చర్యతో పార్లమెంట్ రాజకీయంగా మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రతిపక్షాలు-ప్రభుత్వం మధ్య తీవ్ర వాగ్వాదాలు జరుగుతున్న నేపథ్యంలో, ఈ అవిశ్వాస తీర్మానం సభా వ్యవహారాలను మరింత ఉద్రిక్తంగా మార్చే అవకాశముంది. విపక్షాలు మాత్రం ఇది ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు తీసుకున్న తప్పనిసరి చర్యగా చెబుతున్నాయి. స్పీకర్ తీరులో మార్పు రావాలంటే ఈ స్థాయి రాజకీయ ఒత్తిడి అవసరమని కాంగ్రెస్ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.




ఇప్పుడు ఈ అవిశ్వాస నోటీసుపై 14 రోజుల గడువు పూర్తి కావాల్సి ఉంది. ఆ తర్వాత స్పీకర్ ఈ తీర్మానాన్ని సభలో చర్చకు అనుమతిస్తారా? లేదా సాంకేతిక కారణాలతో వాయిదా వేస్తారా? అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది. చర్చ జరిగితే ప్రభుత్వ, విపక్షాల మధ్య తీవ్ర వాదనలు తప్పవని అంచనా. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై కాంగ్రెస్ తీసుకున్న అవిశ్వాస తీర్మానం దేశ రాజకీయాల్లో మరో కీలక మలుపుగా మారింది. ఇది కేవలం ఒక వ్యక్తిపై అవిశ్వాసం కాదని, పార్లమెంటరీ ప్రజాస్వామ్య స్వరూపంపై జరుగుతున్న పోరాటమని విపక్షాలు చెబుతుండగా, ప్రభుత్వం మాత్రం దీనిని రాజకీయ నాటకంగా కొట్టిపారేస్తోంది. రాబోయే రోజుల్లో ఈ పరిణామం ఎలాంటి దిశ తీసుకుంటుందన్నది రాజకీయంగా కీలకంగా మారనుంది.

# ధైర్యంగా ఉండండి.. పార్టీ మీకు అండగా ఉంది

- **గిరిజన బిడ్డ ఎరుకల మహదేవప్ప ఆత్మహత్య**
- **ఆత్మహత్యపై స్పందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్**
- **కార్యకర్తలకు బీజేపీ అండగా ఉంది**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**



తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల వేళ నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో భారతీయ జనతా పార్టీ 6వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి, గిరిజన బిడ్డ ఎరుకల మహదేవప్ప ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలంగా మారింది. మాఫియా రాజకీయాలు, అహంకార ధోరణి తట్టుకోలేకే మహాదేవప్ప ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఆత్మహత్యపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పందించారు. మహదేవప్ప ఆత్మహత్య చేసుకోవడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఇది అత్యంత బాధాకరమైన ఘటన అని, మహదేవప్ప కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

మహదేవప్పది ఆత్మహత్య కాదు కాంగ్రెస్ చేసిన హత్య అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. 'ఓటమి భయంతోనే బెదిరింపులు, అరాచకాలకు పాల్పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీని రాళ్లతో కొట్టే పరిస్థితి రాబోతోంది. మా సహనాన్ని పిరికితనంగా భావిస్తారా?. ఎన్నికల తరువాత కాంగ్రెస్‌పై యుద్ధం చేయబోతున్నాం. బీఆర్ఎస్ అరాచకాలకు ఎదురొడ్డి పోరాడిన చరిత్ర బీజేపీ కార్యకర్తలది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసే రోజులొచ్చాయి. బీజేపీ కార్యకర్తలారా.. ధైర్యంగా ఉండండి, నాయకత్వం మీకు అండగా ఉంది. మహదేవప్ప కుటుంబాన్ని పరామర్శించేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు బయలుదేరారు. మహదేవప్ప ఆత్మహత్యకు కారకులైన కాంగ్రెస్ నేతలను వెంటనే అరెస్ట్ చేయాలి. నిష్పాక్షికంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలి' అని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# జిల్లా లోని మున్సిపాలిటీలలో ఓటు హక్కు ఉన్న ఉద్యోగస్తులు ఓటు హక్కును వినియోగించుకోవడానికి ప్రత్యేక సాధారణ సెలవు పొందవచ్చు.

- **జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి.**

**వనపర్తి,ఫిబ్రవరి 10 (ప్రజాస్వరం):**

వనపర్తి జిల్లాలో నేడు జరిగే మున్సిపాలిటీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా, జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ప్రత్యేక సాధారణ సెలవు పొందవచ్చని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని వనపర్తి, పెబ్బేరు, కొత్తకోట, ఆత్మకూరు, అమరచింత పురపాలికల్లో పోలింగ్ 11వ తేదీన జరగనుంది. ఈ నేపథ్యములో, ఓటర్లుగా నమోదు చేయబడిన, పోలింగ్‌లో పాల్గొనేందుకు ఆసక్తి గల ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నికల సంఘం సూచన మేరకు 11వ తేదీన 'ప్రత్యేక సాధారణ సెలవు' మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు.అనుగుణమైన ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ ఓటు హక్కును వినియోగించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదర్శ్ సురభి విజ్ఞప్తి చేశారు.





## కార్మికులను బానిసలుగా మార్చేందుకే లేబర్ కోడులు

- **ఫిబ్రవరి 12 సమ్మెను జయప్రదం చేయండి సిఐటియు జిల్లాఅధ్యక్షులు కె.బ్రహ్మచారి**
- **సమ్మె జయప్రదానికై ఐ టి సి లో సి ఐ టి యు విస్తృత ప్రచారం**

**బూర్గంపాడు,ఫిబ్రవరి 10(ప్రజాస్వరం):**

కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడులు కార్మికులకు ఉన్న హక్కులను కట్టు బానిసలుగా మారుస్తాయని సిఐటియు జిల్లాఅధ్యక్షులు పేర్కొన్నారు. కనీస వేతనం రోజుకి 178/ రూపాయలుగా నిర్ణయించారని నెలకు 4600/తో కార్మికుడి కుటుంబం ఎలా బ్రతుకుతుందని సి ఐ టి యూ ప్రశ్నించింది. కార్మికులకు రోజు వేతనం 178 రూపాయలు నిర్ణయించిన ప్రభుత్వం ఎమ్మెల్యేలు ఎంపీలు మంత్రులకు మాత్రం నెలకు రెండు నుంచి నాలుగు లక్షల రూపాయలు ఎలా నిర్ణయిస్తున్నారని ప్రశ్నించారు. ఈ లేబర్ కోడుల వల్ల కార్మికుడికి వేతన భద్రత కరువవుతుందని కనీస వేతనాలు పొందే హక్కు లేకుండా పోతుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు బ్రహ్మచారి పేర్కొన్నారు. కనీస వేతనాలు నిర్ణయించే పద్ధతికే లేబర్ కోడ్ ల లో తిలోదకాలు పలికారని సిఐటియు తెలిపింది. లేబర్ కోడులకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12వ తేదీన జరుగుతున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు ఆధ్వర్యలో ఐ టి సి వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను కలుసుకొని సమ్మె ప్రచారాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా గేట్ మీటింగ్ లో బ్రహ్మచారి మాట్లాడుతూ బీజేపీ తెచ్చిన లేబర్ కోడలు వల్ల పని గంటలు ఎనిమిది గంటల నుండి 12 పెంచుకునే అవకాశాన్ని యజామాన్యాలకు కల్పించారని, అదనపు పని గంటలకు ఓటి విధానాన్ని రద్దు చేశారని దీనివల్ల కార్మికుల శ్రమను ఇష్టానుసారంగా దోచుకోవడమే తప్ప ఎటువంటి రక్షణ ఉండదని సిఐటియు పేర్కొన్నది. 50 మంది కంటే తక్కువ మంది కార్మికుల పనిచేసే ఏ కాంట్రాక్టర్ ప్రభుత్వం నుండి లైసెన్స్ తీసుకోవాల్సిన అవసరం లేకుండా లేబర్ కోడులు నిర్ణయించారని దీనివల్ల కాంట్రాక్టు కార్మికులకు ఎటువంటి చట్టబద్ధత లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ కార్మికులు పనిచేసిన కాలానికి కాంట్రాక్టర్ జీతం ఇవ్వకపోతే పాత చట్టం ప్రకారం ప్రిన్సిపల్ ఎంప్లాయర్ గా అసలు యాజమాన్యం లేదా ప్రభుత్వం జీతం చెల్లించాల్సిన బాధ్యత ఉందని మోడీ తెచ్చిన లేబర్ కోడలు కాంట్రాక్టర్ పని చేయించుకొని జీతాలు ఇవ్వకపోతే ప్రభుత్వానికి యాజమాన్యానికి ఎటువంటి బాధ్యత లేకుండా నిర్ణయించారని దీనివల్ల కార్మికుల తోటి పని చేయించుకొని కాంట్రాక్టర్లు యాజమాన్యాలు జీతాలు ఎగ్గొట్టే అవకాశం ఏముంది తప్ప కార్మికులకు ఒరిగే ప్రయోజనం ఏమీ లేదని సిఐటియు నేత బ్రహ్మచారి విమర్శించారు. కాంట్రాక్ట్ కార్మికుల యొక్క పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడినట్టుగా తయారైందని సిఐటియు పేర్కొన్నది కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల కోసం ఉద్యోగ భద్రత కోసం ఫిబ్రవరి 12 న సమ్మెలో పాల్గొనాలని సిఐటియు విజ్ఞప్తి చేసారు. ఈ ప్రచార కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు సిఐటియు మండల కన్వీనర్ పాండవుల రామనాథం ఐ టి సి పి ఎస్ పి డి కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు వెంకటరెడ్డి పాషా యూనియన్ నాయకులు బత్తుల గోపాలరావు లక్ష్మి నాయకులు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యం.. కుషాయిగూడ పీహెచ్‌సీలో ఆరు నెలలుగా ఎక్స్‌రే మూగబోయింది

- **కుషాయిగూడ పీహెచ్‌సీలో 'ఎక్స్‌రే' కష్టాలు!**
- **ఆరు నెలలుగా మూలకు పడ్డ యంత్రం.. పట్టించుకోని అధికారులు**
- **ప్రైవేట్‌కు వెళ్తేనే స్కానింగ్.. పేద రోగులపై అదనపు భారం**

**కుషాయిగూడ,ఫిబ్రవరి 10(ప్రజాస్వరం)**

పేదవాడికి పెన్నిధిగా ఉండాల్సిన ప్రభుత్వ వైద్యం కుషాయిగూడలో కుంటుపడుతోంది. ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) లో గత ఆరు నెలలుగా ఎక్స్‌రే యంత్రం మొరాయించడంతో రోగుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. సాంకేతిక లోపంతో నిలిచిపోయిన ఈ యంత్రానికి మరమ్మతులు చేయించడంలో ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో సామాన్య ప్రజలు ఆర్థికంగా చితికిపోతున్నారు. రోజూ వందలాది మంది రాక.. కుషాయిగూడ పీహెచ్‌సీ కేవలం స్థానికులకే కాకుండా చుట్టుపక్కల ఉన్న డాక్టర్ ఏఎస్ రావు నగర్, జమ్మిగడ్డ, చర్లపల్లి, కాప్రా, దమ్మాయిగూడ, చక్రిపురం, నాగారం వంటి ప్రాంతాలకు ప్రధాన వైద్య కేంద్రంగా ఉంది. ప్రతిరోజూ ఇక్కడికి 200 నుంచి 300 మంది రోగులు వివిధ రకాల చికిత్సల కోసం వస్తుంటారు. ప్రమాదాలకు గురైన వారు, ఎముకలు విరిగిన వారు, శ్వాసకోశ ఇబ్బందులతో బాధపడేవారికి ఎక్స్‌రే అత్యవసరం. అయితే యంత్రం పని చేయకపోవడంతో డాక్టర్లు ఎక్స్‌రే రాసిచ్చినా, తప్పనిసరి పరిస్థితుల్లో రోగులు ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్ల బాట పట్టాల్సి వస్తోంది. ప్రైవేట్‌లో దోపిడీ..ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా అందాల్సిన ఎక్స్‌రే సేవలు అందకపోవడంతో బయట రూ. 500 నుంచి రూ. 1000 వరకు వసూలు చేస్తున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని కూలీలు, మధ్యతరగతి ప్రజలు ఈ అదనపు భారాన్ని మోయలేక సతమతమవుతున్నారు. సర్కారు దవాఖానాకు వచ్చేదే పైసలు లేక.. ఇక్కడ మెషిన్ పని చేయకపోతే బయట ఇన్ని పైసలు ఎక్కడి నుంచి తేవాలి? అని రోగులు కన్నీరు మున్నీరు పెడుతున్నారు. ఫైళ్లలోనే మరమ్మతులు! యంత్రం పాడైన విషయంపై ఆసుపత్రి సిబ్బంది పలుమార్లు ఉన్నతాధికారులకు, వైద్య ఆరోగ్య శాఖకు నివేదికలు పంపినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ నిధుల కొరత సాకుతోనో లేదా అధికారుల అలసత్వం వల్లే మరమ్మతులు జరగడం లేదని విమర్శలు వస్తున్నాయి. కేవలం ఒక చిన్న రిపేర్ లేదా కొత్త యంత్రం ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం చూపుతున్న జాప్యం పేదల ప్రాణాలతో చెలగాటమాడటమేనని సామాజిక కార్యకర్తలు మండిపడుతున్నారు. తక్షణమే స్పందించాలి.. కుషాయిగూడ పీహెచ్‌సీలో ఎక్స్‌రే సేవలను యుద్ధప్రతిపాదికన పునరుద్ధరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ప్రజా సంఘాలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంటనే స్పందించి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.




## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీజీవో ముందుంటుంది

- **టీజీవో డైరీ–2026 ఆవిష్కరణ కార్యక్రమంలో ఏలూరి శ్రీనివాసరావు టీజీవో సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షులు**

**బూర్గంపాడు,ఫిబ్రవరి 10 (ప్రజాస్వరం):**

తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (TGO) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డైరీ-2026 ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం రాత్రి భద్రాచలం హరిత హోటల్‌లో జిల్లా అధ్యక్షులు సంగం వెంకట పుల్లయ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముందుగా చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అతిథులు,ఆహ్వానితులను ఆకట్టుకుంది. వారి ప్రతిభను అభినందిస్తూ ముఖ్య అతిథి చిన్నారులకు శాలువాలు కప్పి, మెమెంటోలు అందజేసి ప్రశంసించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సంగం వెంకట పుల్లయ్య మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ సమర్థవంతమైన పర్యవేక్షణలో జిల్లాలోని అన్ని విభాగాల గెజిటెడ్ అధికారులు తమ వృత్తిపరమైన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ, టీజీవో అసోసియేషన్‌కు బలమైన వెన్నుదన్నుగా నిలుస్తున్నారని అన్నారు. అలాగే అసోసియేషన్‌ను మరింత పటిష్టంగా తీర్చిదిద్దేందుకు జిల్లా కార్యవర్గం చురుకైన పాత్ర పోషిస్తున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షులు, టీజీఈజేఏసీ సెక్రటరీ జనరల్, డైనమిక్ లీడర్ శ్రీ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ ఆర్థిక బకాయిలను ప్రభుత్వం విడతల వారీగా విడుదల చేస్తున్నదని తెలిపారు. మెడికల్ బిల్స్, సప్లిమెంటరీ బిల్స్‌ను పెండింగ్ లేకుండా క్లియర్ చేస్తున్నదని, అలాగే సరెండర్ లీవ్స్, గ్రాట్యుటీ, పెన్షనర్స్ బెనిఫిట్స్ వంటి అంశాలను ప్రస్తుతం నెలకు విడుదల చేస్తున్న రూ.750 కోట్లను రూ.1500 కోట్లకు పెంచి వీలైనంత త్వరగా పూర్తిగా చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీజీఈజేఏసీ ద్వారా డిమాండ్ చేసినట్లు వెల్లడించారు.ఉద్యోగుల హెల్త్ కార్డు అమలుపై ప్రభుత్వం అతి త్వరలో నిర్ణయం తీసుకోనున్నదని, అలాగే పీఆర్సీ అమలు కోసం కూడా తీవ్రంగా కృషి జరుగుతున్నదని తెలిపారు.డిపార్ట్మెంట్ వారిగా ఉన్న సమస్యల్లో ఇప్పటికే అనేక వాటిని పరిష్కరించినట్లు, ముఖ్యంగా చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న డిపార్ట్మెంటల్ ప్రమోషన్ కమిటీలను నిర్వహించి అనేక విభాగాల్లో ప్రమోషన్లు సాధించామని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో కొంత జాప్యం జరిగిందని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మిగిలిన సమస్యలను టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గెజిటెడ్ అధికారుల కోసం ప్రత్యేక కార్యాలయ భవనం, భద్రాచలంలో దేవస్థానానికి విచ్చేసే అధికారుల సౌకర్యార్థం గెస్ట్ హౌస్ ఏర్పాటు చేయాలని సూచించారు. శ్రీరామనవమి, ముక్కోటి వంటి ముఖ్యమైన సందర్భాలలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చే అధికారులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. ఈ దిశగా జిల్లా కార్యవర్గం కృషి చేయాలని సూచించారు.అనంతరం టీజీవో సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు మరియు ఇతర అతిథుల చేతుల మీదుగా టీజీవో డైరీ-2026ను అధికారికంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వి. మహేష్ కార్యదర్శి నివేదికను వినిపించారు.






ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొంగర వెంకటేశ్వరరావు, మోదుగు వేలాద్రి, అసోసియేట్ అధ్యక్షులు బి. దస్రు, కోశాధికారి జె. తిరుపతి, ఖమ్మం టీజీవో నాయకులు రాంబాబు, డా. విజయ్ కుమార్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహిళా అధ్యక్షురాలు బి. సులోచన రాణి, కన్వీనర్ ఎం. రాణి, సెంట్రల్ అసోసియేషన్ మహిళా విభాగం అసోసియేట్ సెక్రటరీ పి. నీరజ, కార్యవర్గ సభ్యులు శేషప్రసాద్, జిల్లా అసోసియేషన్ ఆఫీస్ బేరర్స్ కె. జమలా రెడ్డి, ఆర్. రాజి రెడ్డి, ఎన్. తిరుమలేష్, ధనియాల వెంకటేశ్వర్లు, చంద్రమోహన్, బండి వెంకటేశ్వర్లు, కే.ఎస్.ఎన్. మూర్తి, లక్ష్మణ్ రావు, నందికొండ వెంకన్న, నరేందర్, వై. సురేందర్ రెడ్డి, నాగరాజు, రమేష్, ఎన్. కనక దుర్గ, పోలవరపు పద్మ, గుప్త, రాజు, డా. ఆనంద రావు, దినేష్ కుమార్, తార, పోచాలరావు, గరుడాచలం తదితరులు, వివిధ డిపార్ట్మెంట్ల ఫోరం అధ్యక్షులు, కార్యదర్శులు, గెజిటెడ్ అధికారులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు.




- **జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి.**

**వనపర్తి,ఫిబ్రవరి 10 (ప్రజాస్వరం):**

నేడు జిల్లాలో 5 మున్సిపాలిటీల్లో జరగనున్న పోలింగ్ కు ఎన్నికలకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ, పోలింగ్ విధులపై అధికారులను స్పష్టంగా ఆదేశించారు. ఆయన వాదన ప్రకారం, “ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం అత్యంత ముఖ్యం. ప్రతి ఓటర్ ఈ విలువైన హక్కును సద్వినియోగం చేసుకోవాలి” అని అన్నారు.

**పోలింగ్ ఏర్పాట్లు:**
మంగళవారం జరిగిన ఏర్పాట్ల పరిశీలనలో, వనపర్తి మున్సిపాలిటీకి సంబంధించిన నర్సింగాయపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో, పెబ్బేరు మున్సిపాలిటీకి సంబంధించి ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాల, కొత్తకోట మున్సిపాలిటీకి సంబంధించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణాల్లో ప్రత్యేకంగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇక, ఎన్నికల రోజు సాయంత్రం రిసెప్షన్ సెంటర్ మరియు పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్‌ను సక్రమంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ రోజుకు సంబంధించిన వివరాలు: ఫిబ్రవరి 11న ఉదయం 7.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ప్రతి ఓటరుకూ ఓటు వేసే అవకాశం అందించనున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. అయితే, ఓటరు స్లిప్‌తో పాటు, ఎన్నికల కమిషన్ గుర్తించిన 17 రకాల గుర్తింపు కార్డులో ఏదో ఒక గుర్తింపు కార్డు తప్పకుండా తీసుకురావాల్సి ఉంటుంది. గుర్తింపు కార్డు లేకుండా ఓటు వేసే అవకాశం ఉండదు.

**భద్రతా ఏర్పాట్లు:**
పోలింగ్ కేంద్రాల భద్రతను దృష్టిలో ఉంచుకుని, అన్ని పోలింగ్ కేంద్రాల్లో సి.సి కెమెరాలు, మైక్రో అబ్జర్వర్లు, సూక్ష్మ పరిశీలకులను నియమించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. అలాగే, 5 మున్సిపాలిటీల 80 వార్డులలో 1,17,441 మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొంటారు.

**సిబ్బంది నియామకాలు:**
ఎన్నికల నిర్వహణ కోసం 20% రిజర్వు సిబ్బందితో పాటు 230 మంది ప్రిసైడింగ్ అధికారులు, 230 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 687 ఒ.పి.ఓ లను నియమించారు. ఈ క్రమంలో, పోలింగ్‌లో పోలీసులు, రూట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది కూడా విధులు నిర్వహించనున్నారు.

**పర్యవేక్షణ:**
డిస్ట్రిబ్యూషన్ ఏర్పాట్లను ఎన్నికల సాధారణ పరిశీలకులు జి. లక్ష్మీ బాయి, వ్యయ పరిశీలకులు శ్రీనివాసులు, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్ ఖీమ్య నాయక్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత తహశీల్దార్లు, ఎంపీడీఓ లు పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా, ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు.





## సాంబశివుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- **కోనపురి లక్ష్మమ్మ కు నివాళులు అర్పించిన జాజుల శ్రీనివాస్ గౌడ్**

**వలిగొండ,ఫిబ్రవరి 10(ప్రజాస్వరం):**


యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని దాసిరెడ్డిగూడెం గ్రామంలో తెలంగాణ ప్రాంత భూమి విముక్తి కోసం తమ విలువైన జీవితాలను దార పోసి పోరాడిన అమరవీరుల జీవిత చరిత్రలను రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్ తరాలకు అందించడానికి నిక్షిప్తం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు వలిగొండ మండలం దాసిరెడ్డిగూడెంలో తెలంగాణ ఉద్యమ పోరాటయోధులు కోనపురి సాంబశివుడు, రాములు తల్లి లక్ష్మమ్మ నిన్న ఆకస్మికంగా మరణించిన విషయం తెలిసిన విషయమే దాసిరెడ్డిగూడెంలో లక్ష్మమ్మ చిత్రపటానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ సహచర బీసీ ఉద్యమ నేతలతో కలిసి లక్ష్మమ్మకు నివాళులు అర్పించారు .అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ గడ్డ ఉద్యమాలకు ఊట చెరువు లాంటిదని, తెలంగాణలో భూస్వామ్య వ్యవస్థ పై తిరుగుబాటు చేసి సమ సమాజం రావాలని పోరాడి అసువులు బాసిన వీరులు ప్రతి పల్లె నుండి ఉద్భవించారని పోరాటాల గడ్డ తెలంగాణకు అడ్డా అని నిరూపించారని వారి నిరూపమాన త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ స్వరాష్టమని ఆయన అన్నారు తెలంగాణలో వేలాదిమంది వీరుల కు జన్మనిచ్చి సమాజం కోసం అంకితం చేసిన తల్లులు ప్రతి ఊరిలో ఉన్నారని అందులో దాసిరెడ్డిగూడెంలో రాజీలేని పోరాటం చేసిన సాంబశివుడు రాములను కన్నా తల్లి లక్ష్మమ్మని ఆయన కొనియాడారు సమాజం కోసం తన ఇద్దరు బిడ్డలను అంకితం చేసిన లక్ష్మమ్మ చిరస్మనీరాలయిలని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కోనపురి కవిత, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు సాయిని యాదగిరి,వలిగొండ పట్టణ అధ్యక్షుడు నానంచర్ల రమేష్,నారి మల్లేష,జాజుల భాస్కర్, నర



## కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం

**కీసర,ఫిబ్రవరి 10(ప్రజాస్వరం):**

మహాశివరాత్రి సందర్భంగా మేడ్చల్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కీసరగుట్టలో శ్రీ భవాని శివదుర్గ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ, కార్యనిర్వాహణాధికారి కట్ట సుధాకర్‌రెడ్డి కలిసి ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్



హరీష్, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో,వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు ఆలయ అధికారులు సీఎంకు వివరించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999